


విజన్ పక్షం

PRGI.TGBIL/26/A0206



నాలుగేళ్లలో 111 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపు!

సంపుటి:-01, సంచిక:-124, మంగళవారం 29-09-2026, పేజీలు:-4, వెల: 2/-, ఎడిటర్:- ఎల్లని రాజేశ్వర్ గౌడ్ , పబ్లిషర్స్ : తెలంగాణ , ఆంధ్రప్రదేశ్

మన్మోహన్‌కు 'భారతరత్న' ఇవ్వాలి



మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రకటించాలని తెలంగాణ

- ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
- హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహావిష్కరణ
- పీవీ, మన్మోహన్ వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందని వ్యాఖ్య
- మౌనాన్ని భాషగా మార్చి గొప్ప పాలన అందించారని ప్రశంస

సిరిసిల్ల వెళుతున్న రేవంత్ రెడ్డికి
కేటీఆర్ బహిరంగ లేఖ



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనకు ముందు కేటీఆర్ బహిరంగ లేఖ
- 8 వేల ఎకరాల భూమి ఆరోపణలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్
- నేతన్నల బకాయిలు చెల్లించి, నిలిచిన పథకాలు పునరుద్ధరించాలని ప్రశ్న
- రైతు బంధు, రుణమాఫీ హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని కోరిన కేటీఆర్
- కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు తేదీలను ప్రకటించాలని నిలదీత

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన - మిగతా 2 లో

ప్రభుత్వం కీలక ప్రకటన

కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు

- కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు రంగం సిద్ధం
- అక్టోబర్ 5న సీడబ్ల్యూసీకి డిజైన్లు సమర్పించనున్న అధికారులు
- నవంబర్ రెండో వారం నుంచి పనులు ప్రారంభం
- భద్రత, నాణ్యతలో రాజీ లేదన్న మంత్రి ఉత్తమ్
- 2027 వర్షాకాలం నాటికి పూర్తి చేయాలని లక్ష్యం

కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు నవంబర్ రెండో వారంలో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. హైదరాబాద్‌లో ఇరిగేషన్ ఉన్నతాధికారులతో - మిగతా 2 లో

అక్టోబరు 12 నుంచి శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

- అక్టోబరు 12 నుంచి 20 వరకు శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు
- అధికమాసం కారణంగా ఈ ఏడాది రెండోసారి బ్రహ్మోత్సవాల నిర్వహణ
- అక్టోబరు 16న గరుడ వాహనం, 19న స్వర్ణరథం, 20న చక్రస్నానం
- ధ్వజారోహణం, ధ్వజావరోహణం లేకుండా జరగనున్న ఉత్సవాలు
- వాహన సేవల పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసిన టీటీడీ



కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల క్షేత్రంలో నవరాత్రి - మిగతా 2 లో


పల్లె పండుగ 3.0

- ఈ నెల 29న రామాపురంలో చంద్రబాబు, పవన్ పర్యటన
- ఈ నెల 29న 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం ప్రారంభం
- నెల్లూరు జిల్లా రామాపురంలో సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ పర్యటన
- గ్రామాల అభివృద్ధి కోసం రూ.10 వేల కోట్ల నిధులు కేటాయింపు
- పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే
- సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పిలుపు



హర్మూజ్‌కు 'ట్రంప్ జలసంధి' అని పేరు పెట్టిన ట్రంప్

ఇరాన్ ప్రతిపాదన తిరస్కరణ



- హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు ఇరాన్ చేసిన ప్రతిపాదన తిరస్కరణ
- అంక్షలు ఎత్తివేస్తే ఏడు రోజుల్లో రాకపోకలు పునరుద్ధరిస్తామన్న ఇరాన్
- ఇరాన్‌ను అణుబాంబును సొంతం చేసుకోనివ్వబోమని స్పష్టం చేసిన ట్రంప్
- ఇరు దేశాల మధ్య ప్రతిష్ఠంభనతో కొనసాగుతున్న ఉద్రిక్తతలు

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు - మిగతా 2 లో

ఉగ్రవాదానికి కేరాఫ్ పాకిస్థాన్
ఉగ్రవాదంతో స్నేహం కుదరదు

- ఉగ్రవాదానికి పాక్ కేరాఫ్ అడ్రస్‌గా మారిందని ఐరాసలో జైశంకర్ విమర్శ
- 'ఆపరేషన్ సిందూర్'పై పాక్ పీఎం షెహబాజ్ షరీఫ్ ఆరోపణలకు కౌంటర్
- ఉగ్రవాదాన్ని ఆపితేనే సంబంధాలు మెరుగుపడతాయని స్పష్టీకరణ



- ఆపరేషన్ నిలిపివేతలో ట్రంప్ జోక్యం చేసుకున్నారన్న పాక్ వాదన
- పాక్ డీజీఎంఓ అభ్యర్థన మేరకే ఆపరేషన్‌ను నిలిపివేశామని భారత్ వెల్లడి

ప్రభుత్వం కీలక ప్రకటన

మొదటిపేజీ తరువాయి – నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించిన డిజైన్లను అక్టోబర్ 5న కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక పర్యవేక్షణ కమిటీకి సమర్పించనున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి అవసరమైన సాంకేతిక అనుమతులు లభించిన వెంటనే పనులు మొదలుపెడతామని స్పష్టం చేశారు. 2027 వర్షాకాలం నాటికి ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. బ్యారేజీల భద్రత, నాణ్యత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) సహా నిపుణుల కమిటీలు లేవనెత్తిన అభ్యంతరాలను, సూచనలను పరిగణనలోకి తీసుకున్నామని, జాతీయ స్థాయి సాంకేతిక సంస్థల సిఫార్సుల మేరకే పనులు చేపడతామని వెల్లడించారు. ఈ మూడు బ్యారేజీల భద్రతను పటిష్ఠం చేసి, వాటి పూర్తి సామర్థ్యాన్ని పునరుద్ధరించడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని ఆయన ఈ సమావేశంలో నొక్కిచెప్పారు.

అక్టోబరు 12 నుంచి శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

మొదటిపేజీ తరువాయి – బ్రహ్మోత్సవాలకు ముహూర్తం ఖరారైంది. అక్టోబరు 12 నుంచి 20వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు విడుదల చేశారు. ఇటీవలే టీటీడీ శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు దసరా బ్రహ్మోత్సవాలకు సన్నద్ధమవుతోంది. చాంద్రమానం ప్రకారం ప్రతి మూడేళ్లకోసారి వచ్చే అధికమాసం కారణంగా ఈ ఏడాది స్వామివారికి రెండోసారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కన్యామాసంలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరగగా, దసరా నవరాత్రులను పురస్కరించుకుని ఆశ్వయుజ మాసంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయతీ. ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం, పెద్ద రథం, ధ్వజావరోహణం ఉండవని టీటీడీ స్పష్టం చేసింది.

ఉత్సవాల్లో భాగంగా స్వామివారు ప్రతిరోజూ ఉదయం, రాత్రి వేళల్లో వివిధ వాహనాలపై మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. అక్టోబరు 16న అత్యంత కీలకమైన గరుడ వాహన సేవ, అక్టోబరు 19న స్వర్ణరథం, అక్టోబరు 20న చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి.

సాధారణంగా ఉదయం వాహన సేవలు 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి సేవలు 7 నుంచి 9 గంటల వరకు జరుగుతాయి. అయితే, గరుడ వాహన సేవ మాత్రం అక్టోబరు 16న సాయంత్రం 6:30 గంటల నుంచి రాత్రి 11:30 గంటల వరకు కన్నుల పండువగా జరగనుంది.

నవరాత్రి బ్రహ్మోత్సవాల వాహన సేవల పూర్తి షెడ్యూల్:

అక్టోబరు 11: అంకురార్పణం (రాత్రి 7 నుంచి 9 గంటల వరకు)

అక్టోబరు 12: బంగారు తిరుచ్చి ఉత్సవం (ఉదయం 9 గంటలకు), పెద్దశేష వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 13: చిన్నశేష వాహనం (ఉదయం 8 గంటలకు), హంస వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 14: సింహ వాహనం (ఉదయం 8 గంటలకు), ముత్యపుపందిరి వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 15: కల్పవృక్ష వాహనం (ఉదయం 8 గంటలకు), సర్వభూపాల వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 16: మోహినీ అవతారం (ఉదయం 8 గంటలకు), గరుడ వాహనం (సాయంత్రం 6:30 గంటలకు)

అక్టోబరు 17: హనుమంత వాహనం (ఉదయం 8 గంటలకు), పుష్పక విమానం (సాయంత్రం 4 గంటలకు), గజ వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 18: సూర్యప్రభ వాహనం (ఉదయం 8 గంటలకు), చంద్రప్రభ వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 19: స్వర్ణరథం (ఉదయం 7 గంటలకు), అశ్వ వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 20: చక్రస్నానం (ఉదయం 6 గంటలకు)

అక్టోబరు 20వ తేదీ ఉదయం జరిగే చక్రస్నానంతో ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది.


పల్లె పండుగ 3.0

మొదటిపేజీ తరువాయి – రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'పల్లె పండుగ 3.0' కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెల 29న నెల్లూరు జిల్లా, ఉదయగిరి నియోజకవర్గంలోని రామాపురంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. వీరి పర్యటనతో రామాపురంలో సందడి వాతావరణం నెలకొంది. రాష్ట్రంలోని పల్లెల రూపురేఖలను సమూలంగా మార్చాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా రూ.10,000 కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడం, పారిశుధ్యం మెరుగుపరచడం, తాగునీటి సౌకర్యం, రహదారుల నిర్మాణం వంటి కీలక పనులను చేపట్టనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పంచాయతీ గ్రాంట్లు, గ్రామీణాభివృద్ధి పథకాలకు పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది. సీఎం, డిప్యూటీ సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. సభా ప్రాంగణం, భద్రతా చర్యలు, పార్కింగ్ సౌకర్యాలను నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేశ్ స్వయంగా పర్యవేక్షించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కూటమి నేతలు సమాయత్తమవుతున్నారు. కోవూరు టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, ఉదయగిరి నియోజకవర్గంలోని జనసేన, బీజేపీ నాయకులతో సమావేశమై ప్రజా సమీకరణపై చర్చించినట్లు తెలిపారు. "ప్రభుత్వం చేపడుతున్న ఈ మహత్తర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి. సెప్టెంబరు 29న రామాపురం గ్రామానికి భారీగా తరలివచ్చి 'పల్లె పండుగ 3.0'ను విజయవంతం చేయాలి" అని ఆమె ప్రజలను కోరారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఇరాన్ ప్రతిపాదన తిరస్కరణ.. హర్మూజ్‌కు 'ట్రంప్ జలసంధి' అని పేరు పెట్టిన ట్రంప్

మొదటిపేజీ తరువాయి – మరోసారి భగ్గుమన్నాయి. వ్యూహాత్మక హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు ఇరాన్ చేసిన ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించారు. అంతేకాకుండా, ఆ జలమార్గానికి 'ట్రంప్ జలసంధి' అని పేరు పెడుతూ సోషల్ మీడియాలో ఒక మ్యాప్‌ను పోస్ట్ చేసి వివాదాన్ని మరింత పెంచారు. అంతకుముందు, న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి సమావేశంలో మధ్యవర్తుల ద్వారా ఇరాన్ ఒక ప్రతిపాదనను అమెరికా ముందుంచింది. తమ ఓడరేవులపై అమెరికా విధించిన నావికా దిగ్బంధనాన్ని ఎత్తివేయడం, స్తంభింపజేసిన ఆస్తులను విడుదల చేయడం, చమురు అమ్మకాలపై ఆంక్షలను సడలించడం వంటి షరతులకు అంగీకరిస్తే.. ఏడు రోజుల్లో హర్మూజ్ జలసంధిలో రాకపోకలను పునరుద్ధరిస్తామని తెలిపింది. అమెరికా అంగీకరించిన ఆరో రోజు నాటికి జలసంధిని తెరుస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ వివరించారు. అయితే, ఈ ప్రతిపాదనను ట్రంప్ తోసిపుచ్చారు. ఇరాన్ మాట నిలబెట్టుకుంటుందన్న నమ్మకం లేదని, టెహ్రాన్ అణ్వాయుధాన్ని సంపాదించకుండా అడ్డుకుంటామని ఆయన స్పష్టం చేసినట్లు అమెరికా అధికారులు తెలిపారు. ఆ తర్వాతే 'ట్రంప్ జలసంధి' పేరుతో ఉన్న మ్యాప్‌ను తన ట్రూత్ సోషల్ ఖాతాలో పంచుకున్నారు. గతంలో ఆగస్టులో కూడా ట్రంప్ ఈ జలసంధిని 'అమెరికా కొత్త భూభాగం'గా పేర్కొనడం గమనార్హం. ప్రపంచ ఇంధన సరఫరాలకు హర్మూజ్ జలసంధి అత్యంత కీలకం. ఈ ఏడాది ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చర్యల తర్వాత ఈ మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తాజా పరిణామాలతో ఇరు దేశాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతోంది.

వంద శాతం ఇథనాల్ కారు.. లీటర్‌కు రూ. 25 ఖర్చే: నితిన్ గడ్కరీ



వంద శాతం ఇథనాల్‌తో నడిచే కార్లు వస్తున్నాయన్న గడ్కరీ లీటర్ పెట్రోల్‌కు రూ. 25 ఖర్చుతో సమానమని వెల్లడి అక్టోబర్‌లో టయోటా 100 శాతం ఇథనాల్ ఇన్నోవా విడుదల పెట్రోల్ లేకుండా నడుస్తూనే 60 శాతం విద్యుత్ ఉత్పత్తి

మన్మోహన్‌కు 'భారతరత్న' ఇవ్వాలి: ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

మొదటిపేజీ తరువాయి – ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, విప్రో సర్కిల్ వద్ద మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, మౌనాన్ని తన భాషగా మార్చుకుని, దేశానికి అద్భుతమైన పాలన అందించిన గొప్ప రాజనీతిజ్ఞుడు మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. అంతటి మహనీయుడికి భారతరత్న ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవ తీసుకుని మన్మోహన్ సింగ్‌ను భారతరత్నతో సత్కరించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలకు అతీతంగా మేధావులను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు మన్మోహన్ సింగ్ బాధ్యతలు చేపట్టారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్‌ల దార్శనికత వల్లే దేశంలో ఆర్థిక సంస్కరణలు వచ్చాయని, దాని ఫలితంగానే నేడు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటివి రూపుదిద్దుకున్నాయని పేర్కొన్నారు. భూసేకరణ చట్టాన్ని తీసుకువచ్చి, భూనిర్వాసితుల అంగీకారాన్ని తప్పనిసరి చేసిన ఘనత మన్మోహన్ సింగ్ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. మన్మోహన్ సింగ్ జీవితం నేటి 'జెన్-జెడ్' సహా అన్ని తరాలకు స్ఫూర్తిదాయకమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల వెళుతున్న రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ

మొదటిపేజీ తరువాయి – దాదాపు మూడేళ్ల తర్వాత తొలిసారిగా సిరిసిల్ల నియోజకవర్గానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నలతో స్వాగతం పలికారు. కేవలం రాజకీయ విమర్శలు, వ్యక్తిగత దూషణలకు పరిమితం కాకుండా, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు, ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ సుదీర్ఘమైన బహిరంగ లేఖను విడుదల చేశారు.

8 వేల ఎకరాల భూమిపై శ్వేతపత్రం ఏది?

అసెంబ్లీలో సీఎం చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ, సిరిసిల్లలో బీఆర్ఎస్ నేతలు 8 వేల ఎకరాల భూమిని దోచుకున్నారని, అందులో 2,400 ఎకరాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పడం నిరాధారమని కేటీఆర్ అన్నారు. 2014 నుంచి 2023 వరకు జిల్లాలో కేవలం 1,272 ఎకరాల భూ పంపిణీ జరిగిందని, అందులో సిరిసిల్ల నియోజకవర్గంలో 204 ఎకరాలు మాత్రమేనని స్పష్టం చేశారు. "ఆ 8 వేల ఎకరాల భూమి ఎక్కడుంది? స్వాధీనం చేసుకున్న 2,400 ఎకరాలు ఏ మండలం, ఏ గ్రామం, ఏ సర్వే నంబర్‌లో ఉన్నాయి? ఆ వివరాలతో తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలి. రుజువు చేయలేకపోతే సిరిసిల్ల ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

నేతన్నల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు?

బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫాంలు, ఇతర ప్రభుత్వ ఆర్డర్లతో నేతన్నలకు రూ.3,313 కోట్ల విలువైన పని కల్పించి, వారి ఆదాయాన్ని రూ.20 వేలకు పెంచామని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పథకాన్ని నిలిపివేసి, ఇతర ఆర్డర్లను దళారులకు కట్టబెట్టి నేతన్నల ఉపాధిని దెబ్బతీసిందని ఆరోపించారు. "నేతన్నల బకాయిలు రూ.60 కోట్లు ఎప్పుడు చెల్లిస్తారు? నిలిపివేసిన 10% యార్న్ సబ్సిడీ, రూ.5 లక్షల నేతన్న బీమా ఎప్పుడు పునరుద్ధరిస్తారు? తేదీలు ప్రకటించాలి" అని ప్రశ్నించారు. వీవింగ్ పార్క్, అపరెల్ పార్క్ ప్రారంభించి కార్మికులను యజమానులుగా మార్చే ప్రణాళికలను ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని నిలదీశారు.

రైతన్నకు ఇచ్చిన మాట ఏమైంది?

రైతుబంధును రూ.15 వేలకు పెంచుతామని, కౌలు రైతులకు కూడా ఇస్తామని హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. "ఎగ్గొట్టిన రైతుబంధు బకాయిలు, రూ.2 లక్షల రుణమాఫీ సంపూర్ణ అమలు, నిలిచిపోయిన రైతుబీమా పునరుద్ధరణ ఎప్పుడు చేస్తారు? స్పష్టమైన తేదీలు ప్రకటించాలి" అని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో రూ.1,604 కోట్లతో చేపట్టిన మల్కపేట రిజర్వాయర్ నుంచి అప్పర్ మానేరుకు నీటిని ఎప్పుడు తరలిస్తారో చెప్పాలన్నారు.

అభివృద్ధి, విద్య, సంక్షేమంపై ప్రశ్నల వర్షం

బీఆర్ఎస్ హయాంలో సిరిసిల్లను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చామని, రూ.400 కోట్లతో మంజూరైన జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీకి నిధులు ఎందుకు విడుదల చేయడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. రూ.1,564 కోట్లతో సిరిసిల్ల పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.40 కోట్ల బకాయిలు విడుదల చేయాలని కోరారు. ఆసరా పెన్షన్లను రూ.4 వేలకు ఎప్పుడు పెంచుతారని, 33 నెలలుగా మహిళలకు బాకీ ఉన్న రూ.82,500 మహాలక్ష్మి సాయం, కల్యాణలక్ష్మి తులం బంగారం హామీ ఏమైందని నిలదీశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థినులకు స్కూటీలు, ఆటో డ్రైవర్లకు రూ.12 వేల సాయం వంటి హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే హామీ, నిలిపివేసిన గొర్రెల పంపిణీ, చేపపిల్లల పంపిణీ, దళితబంధు, బీసీబంధు పథకాలను ఎప్పుడు పునరుద్ధరిస్తారో చెప్పాలని కోరారు. చైతన్యానికి ప్రతీక అయిన సిరిసిల్ల గడ్డపైకి వస్తున్న ముఖ్యమంత్రి, ప్రజల పక్షాన తాము లేవనెత్తిన ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పి, తన పర్యటనకు సార్థకత చేకూర్చాలని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు.

నేపాల్‌లో జల ప్రళయం.. 547కి చేరిన మృతుల సంఖ్య



మొదటిపేజీ తరువాయి – వందలాది మంది ఇప్పటికీ గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. భోటేకోషి నదిలో నీటిమట్టం ప్రమాదకర స్థాయిలో పెరుగుతుండటంతో మళ్లీ వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ఈ కారణంగా సహాయక బృందాలు అత్యంత జాగ్రత్తగా ముందుకు సాగుతున్నాయి. రసువా జిల్లాలో వరదల నుంచి ప్రాణాలతో బయటపడిన కస్టమ్స్ ఏజెంట్ రాజు బుధతోకి మాట్లాడుతూ, "భూమి ఒక్కసారిగా కంపించినట్లు అనిపించింది. కళ్ళు తెరిచేలోపే వరద నీరు ఉవ్వెత్తున ఎగిసిపడి ఇళ్లను తుడిచిపెట్టేసింది. ఈ ప్రమాదం నుంచి బయటపడటం నాకు పునర్జన్మ లాంటిది" అని ఆ భయానక క్షణాలను గుర్తుచేసుకున్నారు. ఈ విపత్తు ప్రభావం చైనా వైపున ఉన్న టిబెట్‌పైనా తీవ్రంగా పడింది. నేపాల్ సరిహద్దులోని పోర్టు వద్ద సంభవించిన వరదల్లో ఐదుగురు మరణించగా, 260 మంది విదేశీయులతో సహా 558 మంది గల్లంతయ్యారని చైనా అధికారులు ప్రకటించారు. ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కమ్యూనిస్ట్ పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించి సహాయక చర్యలపై సమీక్షించారు. నేపాల్‌లోని ఎత్తైన హిమానీనదం (గ్లేసియర్) ఒకటి కూలిపోవడం వల్లే ఈ విపత్తు సంభవించి ఉండవచ్చని చైనా ప్రాథమికంగా అంచనా వేస్తోంది. ఖాట్మండులోని శాస్త్రవేత్తలు కూడా ఇదే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హిమానీనదం కూలిపోవడం, మంచు-రాళ్ల చరియలు విరిగిపడటంతో లెండే నదికి తాత్కాలికంగా ఆనకట్టలా అడ్డుపడిందని, అది ఒక్కసారిగా తెగిపోవడంతో, అక్కడ్నించి భోటేకోషి నదిలోకి ఈ స్థాయిలో వరద ప్రవాహం దూసుకొచ్చిందని భావిస్తున్నారు. ఈ పెను విషాదంపై అంతర్జాతీయ సమాజం స్పందిస్తోంది. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా, ఆయన కేబినెట్ మంత్రులు తమ ఒక నెల జీతాన్ని విపత్తు సహాయ నిధికి విరాళంగా ప్రకటించారు. ఖాట్మండులోని మహాకాళ్ శని భగవాన్ ఆలయంలో బాధితుల ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న భారత పర్యాటకులను భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ కలిసి ధైర్యం చెప్పారు. యునైటెడ్ కింగ్‌డమ్ 5 మిలియన్ పౌండ్ల ఆర్థిక సహాయంతో పాటు, అత్యవసర సహాయక బృందాలను పంపడానికి ముందుకొచ్చింది. గల్లంతైన వారిలో సుమారు 33 మంది బ్రిటిష్ పౌరులు ఉన్నట్లు సమాచారం. సరిహద్దుల్లో అంతర్జాతీయ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

నేపాల్ వరదలు.. ఏపీ, తెలంగాణకు చెందిన 29 మంది గల్లంతు


మొదటిపేజీ తరువాయి – నేపాల్ వరదల్లో చిక్కుకున్న తెలుగు రాష్ట్రాల యాత్రికులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు, తెలంగాణకు చెందిన 22 మంది గల్లంతుయాత్రికుల భద్రతపై చంద్రబాబు, రేవంత్ రెడ్డి సమీక్షలుబాధితుల సహాయం కోసం ఢిల్లీలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుకేంద్ర ప్రభుత్వం, రాయబార కార్యాలయాలతో సమన్వయంనేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లిన తెలుగు రాష్ట్రాల యాత్రికులను తీవ్ర కష్టాల్లోకి నెట్టాయి. ఈ విపత్తు కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు, తెలంగాణకు చెందిన 22 మందితో సహా మొత్తం 29 మంది ఆచూకీ ఇంకా లభించలేదని అధికారులు గురువారం తెలిపారు. వీరిని సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు యాత్రికుల ఆచూకీ తెలియరాలేదని, మరో 34 మంది సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. కర్నూలు-ఆదోనికి చెందిన నలుగురు టిబెట్‌లో క్షేమంగా ఉండగా, తిరుపతి ప్రాంతానికి చెందిన 28 మంది యాత్రికులు ఖాట్మండులో సురక్షితంగా ఉన్నట్లు రియల్-టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) ద్వారా సంప్రదించి నిర్ధారించుకున్నారు. గల్లంతైన ఏడుగురిలో చిత్తూరు, విజయవాడ, కాకినాడ, గుంటూరుకు చెందిన వారున్నారు. వీరిలో ముగ్గురు ఈశా ఫౌండేషన్ నిర్వహించిన యాత్రలో పాల్గొన్నారని, వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ వస్తున్నాయని తెలిపారు. ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా తీసుకురావడమే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బాధితుల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, ఖాట్మండు, చైనాలలోని భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. రోడ్డు, వాయు మార్గాల పునరుద్ధరణతో పాటు, అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా యాత్రికులను తరలించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సహాయక చర్యల కోసం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణకు చెందిన 22 మంది యాత్రికుల ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉందని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తెలిపారు. మొదట 23 మంది గల్లంతైనట్లు భావించినా, రంగారెడ్డి జిల్లాకు చెందిన ఒక యాత్రికుడు తన కుటుంబంతో మాట్లాడటంతో అతను సురక్షితంగా ఉన్నట్లు తేలింది. గల్లంతైన వారిలో ఆరుగురు తెలంగాణకు చెందినవారు కాగా, 17 మంది తెలంగాణ మూలాలున్న ఎన్నారైలు. వీరిలో చాలామంది నేపాల్-టిబెట్ సరిహద్దులోని రసువా, రసువాగఢి, గైరాంగ్ వంటి ప్రాంతాల్లో ఉన్నట్లు చివరిసారిగా తెలిసిందని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఢిల్లీలోని తెలంగాణ భవన్, హైదరాబాద్‌లోని



సచివాలయంలో హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు దాదాపు 80-100 కాల్స్ వచ్చినట్లు తెలిపారు. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కేంద్ర విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయాలతో సమన్వయం చేసుకుంటూ గల్లంతైన వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. బాధితుల కుటుంబాలు, ట్రావెల్ ఆపరేటర్ల నుంచి వచ్చిన సమాచారాన్ని ధ్రువీకరించుకుంటూ సహాయక చర్యలను వేగవంతం చేసినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

ఉగ్రవాదానికి కేరాఫ్ పాకిస్థాన్ ఉగ్రవాదంతో స్నేహం కుదరదు

మొదటిపేజీ తరువాయి – ఐక్యరాజ్యసమితి (ఐరాస) సాధారణ సభ వేదికగా భారత్, పాకిస్థాన్‌ల మధ్య మరోసారి మాటల యుద్ధం చోటుచేసుకుంది. పాకిస్థాన్ 'నిరంతర ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడే దేశం' అని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిన్న 81వ ఐరాస సాధారణ సభలో ఆయన ప్రసంగిస్తూ, అంతకుముందు రోజు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన ప్రసంగంలోని వాస్తవాలను వక్రీకరించారని దుయ్యబట్టారు. పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించకుండా.. "నిన్న, ఉగ్రవాదాన్ని అలవాటుగా మార్చుకున్న ఒక దేశం ఈ సభ ముందు వాస్తవాలను వక్రీకరించింది. ఉగ్రవాదాన్ని సాధారణీకరించేందుకు, దాని పరిణామాల నుంచి తప్పించుకోవడానికి వాదనలు వినిపించింది. అది కుదరదు. ఉగ్రవాదం నుంచి మమ్మల్ని మేము రక్షించుకునే హక్కును వినియోగించుకుంటాం. ఉగ్రవాదం, స్నేహం కలిసి కొనసాగలేవు" అని జైశంకర్ స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారే తమ పద్ధతులు మార్చుకోవాలని ఆయన హితవు పలికారు. శుక్రవారం తన ప్రసంగంలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్.. గత ఏడాది మే నెలలో భారత్ నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్'ను 'తప్పుడు సాకుతో చేసిన బాహ్య దురాక్రమణ'గా అభివర్ణించారు. ఐరాస చార్టర్‌లోని ఆర్టికల్ 51 ప్రకారం తమ సైన్యం ఆత్మరక్షణ కోసమే ప్రతిదాడి చేసిందని, శత్రువుకు ఎప్పటికీ మరిచిపోలేని గుణపాఠం



చెప్పిందని పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌ను, సైన్యాన్ని ప్రశంసించారు. ఆపరేషన్‌ను నిలిపివేయడంలో సకాలంలో జోక్యం చేసుకున్నందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆ తర్వాత ట్రంప్ కూడా ఈ ప్రసంగంలోని 87 సెకన్ల క్లిప్‌ను ఎలాంటి వ్యాఖ్య లేకుండా తన ట్రూత్ సోషల్ ఖాతాలో పంచుకున్నారు.అయితే, పాక్ వాదనలను భారత్ తీవ్రంగా ఖండించింది. గత ఏడాది ఏప్రిల్ 22న పహల్గామ్‌లో 26 మంది పౌరుల మరణానికి కారణమైన ఉగ్రదాడికి ప్రతీకారంగానే, మే 7న పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై 'ఆపరేషన్ సిందూర్' ప్రారంభించినట్లు భారత్ గుర్తుచేసింది. ట్రంప్ జోక్యం వల్లే ఆపరేషన్ ఆగిందన్న వాదనలో నిజం లేదని, పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) తమ భారత ప్రతిరూపానికి చేసిన అభ్యర్థన మేరకే ఆపరేషన్‌ను తాత్కాలికంగా నిలిపివేసినట్లు న్యూఢిల్లీ స్పష్టం చేసింది.

ప్రభుత్వ భూమిలో ప్రైవేట్ స్కూల్?

సర్వే నం.151పై దుమారం.. పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌పై సమగ్ర విచారణకు సీపీఎం డిమాండ్

భూమి ప్రభుత్వానిదని తేలితే వెంటనే స్వాధీనం చేసుకోవాలి.. బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి: అల్లి దేవేందర్



మొయినాబాద్, సెప్టెంబర్ 28 (విజన్ పక్షం): ప్రభుత్వ భూమి పరిరక్షణలో రెవెన్యూ యంత్రాంగం వైఫల్యమా? లేక ప్రభావశీలుర ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గుతున్నారా? మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 151లో పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ కొనసాగుతున్నదనే ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ భూమిని ప్రైవేట్ సంస్థ వినియోగిస్తోందనే ఫిర్యాదుపై సీపీఎం మొయినాబాద్ మండల కమిటీ ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. భూమి వాస్తవంగా ఎవరి పేరులో ఉంది? ఏ ప్రాతిపదికన వినియోగిస్తున్నారు? భూమి కేటాయింపు లేదా లీజ్ ఉంటే దానికి సంబంధించిన ఉత్తర్వులు ఏమిటి? నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు ఉన్నాయి? అనే అంశాలపై జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని సీపీఎం డిమాండ్ చేసింది.

“రికార్డులు బయటపెట్టాలి”

సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్, మొయినాబాద్ మండల కార్యదర్శి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల విషయంలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా రెవెన్యూ రికార్డులు, పహాణీలు, భూమి వర్గీకరణ, పట్టా/ప్రభుత్వ భూమి వివరాలు, కేటాయింపు ఉత్తర్వులు, నిర్మాణ అనుమతులు అన్నింటినీ బహిరంగంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు. “సర్వే నంబర్ 151 ప్రభుత్వ భూమిగా అధికారిక రికార్డుల్లో నిర్ధారణ అయితే, వెంటనే అక్రమ వినియోగాన్ని నిలిపివేసి భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలి. ప్రభుత్వ ఆస్తిని ఎవరు ఆక్రమించినా చట్టప్రకారం చర్యలు తప్పవు” అని వారు అన్నారు.

మొయినాబాద్‌లో ప్రభుత్వ భూములపై స్పెషల్ డ్రైవ్ చేయాలి

మొయినాబాద్ మండల పరిధిలో విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయని సీపీఎం నాయకులు ఆరోపించారు. ప్రభుత్వ భూములపై ప్రత్యేక సర్వే నిర్వహించి, ఆక్రమణకు గురైన భూముల పూర్తి జాబితాను ప్రజల ముందుంచాలని వారు జిల్లా కలెక్టర్‌ను కోరారు. ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులు లేదా సంస్థలు అనుమతులు లేకుండా వినియోగిస్తున్నట్లు తేలితే కేవలం నిర్మాణాలను పరిశీలించడం కాకుండా భూమి హక్కులు, అనుమతులు, రెవెన్యూ రికార్డుల మార్పులు, సంబంధిత అధికారుల చర్యలు/నిర్లక్ష్యం అన్న కోణాల్లోనూ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

రాజకీయ పలుకుబడికి అతీతంగా విచారణ

ఈ వ్యవహారంలో రాజకీయంగా ప్రభావశీల వ్యక్తుల పేర్లు వినిపిస్తున్న నేపథ్యంలో వ్యక్తుల హోదాతో సంబంధం లేకుండా స్వతంత్రంగా విచారణ జరగాలని సీపీఎం కోరింది. “ప్రభుత్వ భూమి అయితే ఎవరికీ మినహాయింపు ఉండకూడదు. ప్రభుత్వ ఆస్తి రక్షణ విషయంలో చట్టం తన పని తాను చేయాలి” అని అల్లి దేవేందర్ స్పష్టం చేశారు.

కలెక్టర్ ముందున్న ప్రధాన ప్రశ్నలు

సర్వే నం.151 అసలు స్వరూపం ఏమిటి?

భూమి ప్రభుత్వానిదే అయితే ప్రైవేట్ స్కూల్‌కు వినియోగ హక్కు ఎలా వచ్చింది?

భూమి కేటాయింపు/లీజ్ ఉంటే దానికి సంబంధించిన ఉత్తర్వులు ఏమిటి?

నిర్మాణాలకు అన్ని చట్టబద్ధ అనుమతులు ఉన్నాయా?

ప్రభుత్వ భూమి వినియోగంపై రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

ఈ ప్రశ్నలకు అధికారిక రికార్డుల ఆధారంగా సమాధానాలు వెల్లడించాలని సీపీఎం డిమాండ్ చేసింది. ప్రభుత్వ భూమి అని విచారణలో తేలితే వెంటనే స్వాధీనం చేసుకోవడంతో పాటు, అక్రమ వినియోగానికి బాధ్యులైన వ్యక్తులు మరియు నిర్లక్ష్యం వహించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం కోరింది. ఈ కార్యక్రమంలో సీపీఎం మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి.. పేరుకేనా?

65 వేల మందికి ఒక్క అర్జీనేనా? శంకర్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణిపై ప్రశ్నల వర్షం



శంకర్‌పల్లి, సెప్టెంబర్ 28 (విజన్ పక్షం): ప్రజల సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటికి పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం శంకర్‌పల్లి మండలంలో కేవలం మొక్కుబడిగా మారిందా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. శంకర్‌పల్లి మండల ఎంపీడీవో కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ.. ఈ కార్యక్రమం గురించి గ్రామస్థాయిలో ఎంతమందికి సమాచారం చేరుతోంది? అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం కనిపించడం లేదు.

ప్రచారం ఎక్కడ? సమాచారం ప్రజలకు చేరిందా?

ప్రజావాణి కార్యక్రమంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శులపై ఉంది. అయితే గ్రామాల్లో దండోరా, మైక్ అనౌన్స్‌మెంట్, నోటీసులు, వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారం వంటి ప్రచార చర్యలు ఎంతవరకు చేపట్టారనే దానిపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు కార్యక్రమం గురించి తెలియకపోతే.. వారు తమ సమస్యలను అధికారుల ముందుకు ఎలా తీసుకురాగలరనే ప్రశ్న తలెత్తుతోంది.

65 వేల జనాభా.. ఒక్క దరఖాస్తు!

శంకర్‌పల్లి మండలం, మున్సిపాలిటీ పరిధిలో సుమారు 65 వేల మందికి పైగా జనాభా ఉన్న నేపథ్యంలో ప్రజావాణికి కేవలం ఒక్క దరఖాస్తు మాత్రమే రావడం చర్చనీయాంశంగా మారింది. “65 వేల మందిలో ఒక్కరికే సమస్య ఉందా? లేక ప్రజావాణి కార్యక్రమం గురించి ప్రజలకు సరైన సమాచారం అందలేదా?” అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఒక్క అర్జీ రావడాన్ని ప్రజలకు సమస్యలు లేవని భావించకుండా, ప్రజావాణి అందుబాటులోకి తీసుకెళ్లడంలో లోపాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో అధికారులు సమీక్షించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

ప్రజావాణి అంటే ప్రజల వద్దకు వెళ్లే వ్యవస్థ కావాలి

ప్రజావాణి కేవలం కార్యాలయంలో ఒక కార్యక్రమం నిర్వహించడం వరకే పరిమితం కాకుండా.. ప్రజలకు సమాచారం ఇవ్వడం, వారి సమస్యలను స్వీకరించడం, సంబంధిత శాఖకు పంపించడం, పరిష్కారాన్ని పర్యవేక్షించడం, చివరకు ఫలితాన్ని ప్రజలకు తెలియజేయడం వరకు పూర్తి స్థాయి వ్యవస్థగా ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారుల సమీక్షకు 5 కీలక ప్రశ్నలు

1. ప్రతి గ్రామంలో ప్రజావాణిపై ప్రచారం చేశారా?
2. ప్రజావాణికి వచ్చిన అర్జీల సంఖ్య, వాటి పరిష్కార స్థితిపై రిజిస్టర్ నిర్వహిస్తున్నారా?
3. ఒక్క అర్జీ మాత్రమే వస్తే దానికి కారణాలను అధికారులు విశ్లేషించారా?
4. పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారా?
5. గ్రామస్థాయిలో ప్రజలకు ప్రజావాణి తేదీ, సమయం, వేదికపై ముందస్తు సమాచారం ఇస్తున్నారా?

ప్రజల డిమాండ్లు

ప్రతి గ్రామంలో ప్రజావాణిపై విస్తృత ప్రచారం నిర్వహించాలి.

పంచాయతీ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు, ప్రధాన కూడళ్ల వద్ద నోటీసులు/ప్రకటనలు ఏర్పాటు చేయాలి.

అవసరమైన చోట దండోరా, మైక్ అనౌన్స్‌మెంట్ నిర్వహించాలి.

గ్రామాల వాట్సాప్ గ్రూపులు, అధికారిక సోషల్ మీడియా వేదికల ద్వారా ముందస్తు సమాచారం ఇవ్వాలి.

ప్రజావాణికి వచ్చిన అర్జీల సంఖ్య, శాఖల వారీగా పెండింగ్, పరిష్కరించిన వివరాలను పారదర్శకంగా ప్రకటించాలి.

ప్రతి అర్జీకి రసీదు/అర్జీ నంబర్ ఇచ్చి, దాని స్థితిని తెలుసుకునే అవకాశం కల్పించాలి.


ఒక నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించని అర్జీలపై సంబంధిత అధికారులు స్పష్టమైన కారణం నమోదు చేయాలి.

“ప్రజావాణి.. ప్రజలకు తెలియకపోతే ప్రయోజనం ఏమిటి?”

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శంకర్‌పల్లి ప్రజావాణి నిర్వహణపై సమీక్ష చేపట్టి, పేరుకే కార్యక్రమంగా కాకుండా ప్రతి గ్రామస్తుడి సమస్యకు వేదికగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

యువత భగత్ సింగ్ లా పోరాడాలి


సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పిలుపు



జగద్గిరిగుట్ట,సెప్టెంబర్28(విజన్ పక్షం దినపత్రిక): భారత్ స్వతంత్ర సమరయోధుడు ఉద్యమకారుడు భగత్ సింగ్ 119వ జయంతి సందర్భంగా సోమవారం నాడు అఖిల భారత యువజన సమైక్య (ఏఐవైఎఫ్)ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట,మగ్దూమ్ నగర్ లోని భగత్ సింగ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు సీపీఐ పార్టీ నాయకులు ఉమామహేష్.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ వారిని క్షమాభిక్ష అడిగితే భగత్ సింగ్ ఉరి శిక్ష రద్దయ్యేది. కానీ దేశ స్వాతంత్రం కంటే తన ప్రాణమేమి గొప్పది కాదని భావించి బ్రిటిష్ వారికి ఎదురు తిరిగి నిలిచిన మహా వీరుడు భగత్ సింగ్ అని కొనియాడారు.ఈ దేశ స్వతంత్రం కోసం తన ప్రాణాలు అర్పించిన సమరయోధుడు భగత్ సింగ్ అన్నారు.ఆయన తెగువ స్ఫూర్తి యువతకు మార్గదర్శంగా నిలిచిందన్నారు.భగత్ సింగ్ కళలు కన్న భారతం నేడు లేదని దారితప్పింది. భగత్ సింగ్ ఆశయాలను ఆదర్శాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకుని ఈ దేశంలో సమసమాజ నిర్మాణం కోసం అసమానతలు లేని భారతదేశం కోసం పోరాడాలని ఉమామహేష్ పిలుపునిచ్చారు. నేడు కొంతమంది క్షమాభిక్ష అడిగిన వాళ్ళను పొగుడుతున్నారని అలాంటివారు ఎలా స్వతంత్ర సమరయోధులు అవుతారని వాళ్ళ వారసులుగా చెప్పుకునే వాళ్ళు కూడా క్షమాభిక్ష కోరిన వారిని తమ నాయకుడిగా పిలుచుకోవడం సిగ్గుచేటని అన్నారు.అనంతరం సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏసురత్నం,సిపిఐ మండల కార్యదర్శి కే స్వామిలు మాట్లాడుతూ యువత నిరాశ చెందకుండా ఢిల్లీలో జరిగిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని బిజెపి ఆర్ఎస్ఎస్ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండ కడితేనే మంచి భవిష్యత్తు ఉంటుందని యువత మత్తుకు బానిస కాకుండా, మత విద్వేష రాజకీయాలకు గురికాకుండా రాజకీయాలు చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్,కీర్తి నాయకత్వం వహించగా, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు హైమావతి, ఏఐటీయుసీ కార్యదర్శి శ్రీనివాస్ సిపిఐ మండల సహాయ కార్యదర్శి రాములు ప్రజానాట్యమండలి అధ్యక్షులు బాబు మాజీ కార్యదర్శి వెంకటేష్ శాఖా కార్యదర్శులు సహదేవరెడ్డి, నరసయ్య ఏఐవైఎఫ్ నాయకులు సురేష్, విజయ్, మహేందర్, శ్రీనివాస్ సిపిఐ నాయకులు ఇమామ్,చారి, తెలంగాణ సోమన్న తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో లాస్య శ్రీ సత్తా!

జిల్లా స్థాయి పోటీల్లో స్వర్ణ పతకం.. రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత



శంషాబాద్, సెప్టెంబర్ 28, విజన్ పక్షం: కరాటే పోటీల్లో ఓయాసిస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థిని వి. లాస్య శ్రీ అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాన్ని సాధించింది. జిల్లాస్థాయిలో మెరిసిన లాస్య శ్రీ ఇప్పుడు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై తన సత్తా చాటేందుకు సిద్ధమైంది. ఇటీవల నిర్వహించిన 70వ ూ+ఖీ× రంగారెడ్డి జిల్లా కరాటే ఛాంపియన్‌షిప్లో అండర్--17, 40 కిలోల లోపు విభాగంలో లాస్య శ్రీ పోటీపడి ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రత్యర్థులపై విజయాలు సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకోవడంతో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. లాస్య శ్రీ విజయంపై పాఠశాల ప్రిన్సిపాల్ కె. ప్రవలిక రెడ్డి, కరాటే కోచ్ ఈ. శివ పవార్, క్రీడా విభాగం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఆమెను ప్రత్యేకంగా అభినందిస్తూ, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, రంగారెడ్డి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

‘నషాముక్త భారత్’ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పున్నారెడ్డి



గాజులరామారం,సెప్టెంబర్28(విజన్ పక్షం దినపత్రిక): నేటి సమాజంలో యువత పెడదారి పట్టడానికి ప్రధాన కారణం మత్తుపదార్థాలు. యువతపై మత్తు పదార్థాలు ఏలాంటి ప్రభావం చూపిస్తుందో చూస్తూనే ఉన్నాం.వాటి నిర్మూలన కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి.నషాముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా గాజులరామారం బస్తీ దవాఖానా వైద్యాధికారులు డా.ఝాన్సీ రాణి,డా.టి.శ్రీచంద్రిక ఆశా వర్కర్ కార్యకర్తలు కలిసి మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ముఖ్యంగా చిన్నారులు, యువత మరియు సమాజంపై పడే ప్రతికూల ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం డ్రగ్ ఫ్రీ ఇండియా కోసం ప్రతిజ్ఞ చేశారు.ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి గారు, మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని మన పిల్లల భవిష్యత్తును కాపాడుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. “మత్తుకు నో చెప్పండి... మన పిల్లల భవిష్యత్తుకు భరోసా ఇవ్వండి అని కోరారు. “డ్రగ్స్ లేని భారత్ -- ఆరోగ్యవంతమైన భారత్.”

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కూన



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్28(విజన్ పక్షం దినపత్రిక):చింతల్ సర్కిల్ పరిధిలోని రోడమేస్త్రి నగర్ డివిజన్,ఎన్‌టీఆర్ నగర్ దర్బార్ బస్తీలలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి సుమారు రూ.27లక్షల నిధులతో పలు శంకుస్థాపనలు చేశారు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ గారు మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి తగిన నిధులు కేటాయించలేదని విమర్శించారు.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. స్థానిక ప్రజల అవసరాలను గుర్తించి సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల బస్తీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్ల నిర్మాణంతో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తీరనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజ్‌గిరి డీసీసీ ఉపాధ్యక్షుడు కూన శ్రీనివాస్ గౌడ్,స్థానిక డివిజన్ అధ్యక్షుడు గుమస్తా మధుసూదన్ బస్తీ వాసులు సత్యనారాయణ,ప్రసాద్, రమేష్, వేణు, శ్రీను, అలీ, స్థానిక కాంగ్రెస్ కాంగ్రెస్ నాయకులు కాజా,బలరాం, రాజిరెడ్డి, రఘు రెడ్డి, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

బహదూర్‌గూడ రైతులకు కేటీఆర్ అభయం!

భూ వివాదాలు, పట్టాల సమస్యల పరిష్కారానికి హామీ



శంషాబాద్, సెప్టెంబర్ 28, విజన్ పక్షం: శంషాబాద్ పరిధిలోని బహదూర్‌గూడ గ్రామ రైతుల భూ సమస్యలు, పట్టాల వివాదాలకు పరిష్కారం చూపేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సానుకూలంగా స్పందించారు. భూముల విషయంలో ఎదుర్కొంటున్న సాంకేతిక, చట్టపరమైన ఇబ్బందులను రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, నాయకుడు కార్తీక్ రెడ్డి నేతృత్వంలో బహదూర్‌గూడకు చెందిన బాధిత రైతులు సోమవారం కేటీఆర్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. భూములకు సంబంధించిన రికార్డులు, పట్టాలు, హక్కుల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను సమగ్రంగా ఆయనకు వివరించారు. రైతుల సమస్యలను సానుకూలంగా విన్న కేటీఆర్, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బహదూర్‌గూడ రైతుల భూ సమస్యలను పరిష్కరించి, అర్హులైన రైతులకు హక్కు పత్రాలు (పట్టాలు) అందించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. “రైతులకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది” అని కేటీఆర్ భరోసా ఇచ్చినట్లు సమాచారం. ఈ భేటీలో బీఆర్ఎస్ నాయకులు కోన మొల్ల శ్రీనివాస్, ప్రదీప్ రెడ్డి, బుచ్చిరెడ్డి, జయసింహ, బూర్గుంట సతీష్, చెక్కల ఎల్లయ్య, మల్లేష్ బైరమోని, మోహన్ రావు తదితరులతో పాటు స్థానిక నేతలు చిలకమర్రి పరంధాములు, సాగర్, రాచమల్ల రమేష్, రమేష్ రాథోడ్, రాహుల్, గౌస్, శ్రీకాంత్ పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో బహదూర్‌గూడ రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు హాజరై తమ సమస్యల పరిష్కారంపై ఆశాభావం వ్యక్తం చేశారు

ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

పెండింగ్‌లో ఉంచకుండా గడువులోగా పరిష్కరించాలి: కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



రంగారెడ్డి జిల్లా, సెప్టెంబర్ 28: (విజన్ పక్షం): ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా, ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని ప్రాధాన్యతతో పరిశీలించి, నిబంధనల ప్రకారం సత్వరం పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా మొత్తం 89 అర్జీలు అందాయి. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పడేపడే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. అవసరమైన సందర్భాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. అర్జీల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పర్యవేక్షించాలని సూచించారు.

89 అర్జీలు స్వీకరణ

ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 54 అర్జీలు, ఇతర శాఖలకు సంబంధించి 35 అర్జీలు అందాయి. మొత్తం 89 అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు చేపట్టి, పరిష్కార స్థితిని పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో భారీ నిరసన




మేడ్చల్,సెప్టెంబర్28(విజన్ పక్షం దినపత్రిక): భారత ఎన్నికల సంఘ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ధోరణికి వ్యతిరేకంగా సర్ ప్రక్రియలో జరిగిన అవకతవకలను నిరసిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపుతో మేడ్చల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆదేశాలతో ఆరంభమైన నిరసన కార్యక్రమం మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ ర్యాలీగా వెళ్లారు. అనంతరం కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఓటర్ల హక్కుల రక్షణ ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్దయెత్తున నినాదాలు చేశారు.ప్రజా స్వామ్య పరిరక్షణ కోసం ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలని కోరారు. బీజేపీ నిరంకుశ ధోరణికి చరమగీతం పాడే సమయం దగ్గర పడిందని అన్నారు.ప్రజల పక్షాన నిలబడి ప్రజా సంక్షేమం కోసం పాటు పడడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. ఎన్నికల కమిషన్ లో జరిగిన తప్పులను సరిచేసి దేశ ప్రజలకు జ్ఞానేశ్ కుమార్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే జ్ఞానేశ్ కుమార్ ను అరెస్ట్ చేసి విచారణ చేప్పట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ కమిటీ సభ్యులు ముత్యం రెడ్డి,మేకల ఎల్లయ్య,మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లక్ష్మా రెడ్డి, రషీద్ బేగ్, క్రిష్ణ గౌడ్, మాజీ సర్పంచ్ కావలి గణేష్,డివిజన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి,అర్కల విజయ్ గౌడ్, వారగాని వాసు,జలీల్ ఖాన్, రాజుచారి,చందు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో స్వర్ణం.. రాష్ట్రస్థాయిలో సత్తా చాటేందుకు లాస్య శ్రీ సిద్ధం!

మరకత శివాలయంలో రాజ్ భూపాల్ గౌడ్ ప్రత్యేక పూజలు

పురాతన ఆలయంలో అభిషేకం.. స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్ష



శంకర్‌పల్లి, సెప్టెంబర్ 28 (విజన్ పక్షం): శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో కొలువై ఉన్న 11వ శతాబ్దానికి చెందిన శ్రీ మహిమగల బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో సోమవారం బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఆయన స్వామివారికి అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా రాజ్ భూపాల్ గౌడ్ మాట్లాడుతూ, ఎంతో పురాతనమైన మరకత శివాలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా, ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందన్నారు. స్వామివారి కృప, ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు రాజ్ భూపాల్ గౌడ్‌ను శేషవస్త్రంతో ఘనంగా సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఇలా చేస్తే మీ బ్యాంకు ఖాతాను ఎవ్వరు కూడా హ్యాక్ చేయలేరు!









ఈ రోజుల్లో బ్యాంకింగ్ మోసాలు ఎన్నో జరుగుతున్నాయి. సైబర్ మోసాల కారణంగా బ్యాంకు అకౌంట్‌లను మోసగాళ్లు హ్యాక్ చేసేస్తున్నారు. అందుకే బ్యాంక్ అకౌంట్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. కొన్ని ట్రిక్స్ పాటించడం వల్ల అకౌంట్‌ను సురక్షితంగా ఉంచుకోవచ్చు. ఆ ట్రిక్స్ ఏంటో తెలుసుకుందాం.. బలమైన పాస్‌వర్డ్‌లు: రెండు కారకాల ప్రామాణీకరణ బలమైన పాస్‌వర్డ్‌లను ఎంచుకోండి. (పెద్ద-చిన్న అక్షరాలు, సంఖ్యలు, ప్రత్యేక అక్షరాలు). రెండు కారకాల ప్రామాణీకరణను ప్రారంభించండి. %ఖా% తో ఖాతాను సురక్షితంగా ఉంచండి. బలమైన పాస్‌వర్డ్‌లు: రెండు కారకాల ప్రామాణీకరణ బలమైన పాస్‌వర్డ్‌లను ఎంచుకోండి. (పెద్ద-చిన్న అక్షరాలు, సంఖ్యలు, ప్రత్యేక అక్షరాలు). రెండు కారకాల ప్రామాణీకరణను ప్రారంభించండి. తో ఖాతాను సురక్షితంగా ఉంచండి.

క్రమం తప్పకుండా ఖాతా పర్యవేక్షణ: ఖాతా స్టేట్‌మెంట్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేయండి. ఆన్‌లైన్/మొబైల్ బ్యాంకింగ్ ద్వారా లావాదేవీలను తనిఖీ చేయండి. అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే బ్యాంకుకు నివేదించండి. క్రమం తప్పకుండా ఖాతా పర్యవేక్షణ: ఖాతా స్టేట్‌మెంట్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేయండి. ఆన్‌లైన్/మొబైల్ బ్యాంకింగ్ ద్వారా లావాదేవీలను తనిఖీ చేయండి. అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే బ్యాంకుకు నివేదించండి.

నకిలీ కాల్స్/ఇమెయిల్స్ పట్ల జాగ్రత్త వహించండి: బ్యాంక్ ఎప్పుడూ పాస్‌వర్డ్,ఖాతా సమాచారాన్ని అడగదు. నకిలీ కాల్స్/ఇమెయిల్స్‌ను నివారించండి. అనుమానాస్పద కార్యకలాపాలను బ్యాంకుకు నివేదించండి. నకిలీ కాల్స్/ఇమెయిల్స్ పట్ల జాగ్రత్త వహించండి: బ్యాంక్ ఎప్పుడూ పాస్‌వర్డ్, ఖాతా సమాచారాన్ని అడగదు. నకిలీ కాల్స్/ఇమెయిల్స్‌ను నివారించండి. అనుమానాస్పద కార్యకలాపాలను బ్యాంకుకు నివేదించండి.

మీ మొబైల్/ఈమెయిల్‌ను తాజాగా ఉంచండి: మీ సరైన మొబైల్ నంబర్/ఈమెయిల్‌ను బ్యాంకులో నమోదు చేసుకోండి. మీ నంబర్ మారితే, ఏదైనా అనుమానాస్పద కార్యాచరణ గురించి మీరు అప్రమత్తంగా ఉండేలా వెంటనే దాన్ని అప్‌డేట్ చేయండి. మీ



మొబైల్/ఈమెయిల్‌ను తాజాగా ఉంచండి: మీ సరైన మొబైల్ నంబర్/ఈమెయిల్‌ను బ్యాంకులో నమోదు చేసుకోండి. మీ నంబర్ మారితే, ఏదైనా అనుమానాస్పద కార్యాచరణ గురించి మీరు అప్రమత్తంగా ఉండేలా వెంటనే దాన్ని అప్‌డేట్ చేయండి.

సురక్షిత ఇంటర్నెట్ వినియోగం: నెట్ బ్యాంకింగ్ కోసం ప్రైవేట్, సురక్షితమైన ఇంటర్నెట్ కనెక్షన్‌ను ఎంచుకోండి. పబ్లిక్ వై-ఫై (హోటళ్ళు, కేఫ్‌లు)లో బ్యాంకింగ్ చేయకుండా ఉండండి. ఇలా చేయడం వల్ల మీ బ్యాంకు ఖాతాను ఎవ్వరు కూడా హ్యాక్ చేయలేరు. సురక్షిత ఇంటర్నెట్ వినియోగం: నెట్ బ్యాంకింగ్ కోసం ప్రైవేట్, సురక్షితమైన ఇంటర్నెట్ కనెక్షన్‌ను ఎంచుకోండి. పబ్లిక్ వై-ఫై (హోటళ్ళు, కేఫ్‌లు)లో బ్యాంకింగ్ చేయకుండా ఉండండి. ఇలా చేయడం వల్ల మీ బ్యాంకు ఖాతాను ఎవ్వరు కూడా హ్యాక్ చేయలేరు.

రూ.810 ప్లాన్‌కు ముందు స్టార్‌లింక్ కిట్ కోసం ఎంత డబ్బు చెల్లించాలి?

నివేదికల ప్రకారం, స్టార్‌లింక్ కిట్‌లో 4 ప్రధాన విషయాలు ఉన్నాయి. వీటిలో స్టార్‌లింక్ డిష్, వై-ఫై రౌటర్, పవర్ సప్లై కేబుల్, మౌంటింగ్ ట్రైపాడ్ ఉన్నాయి. స్టార్‌లింక్ డిష్ ఇంటి పైకప్పుపై లేదా స్తంభం పైభాగంలో అమర్చబడి ఉంటుంది. భారతదేశంలో స్టార్‌లింక్ ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించడానికి మార్గం సుగమం అయింది. ఎలోన్ మస్క్ కంపెనీ ప్రభుత్వం నుండి అవసరమైన లైసెన్స్‌ను పొందింది. జియో, భారతీ ఎయిర్‌టెల్ మద్దతు ఇచ్చిన వన్‌వెబ్ ఇప్పటికే ఈ లైసెన్స్‌ను పొందింది. ఇప్పుడు స్పెక్ట్రమ్ కేటాయింపు తర్వాత, దేశంలో ఉపగ్రహ ఇంటర్నెట్‌ను ప్రారంభించడానికి మార్గం సుగమం అవుతుంది. మీరు కూడా మీ ఇంట్లో ఉపగ్రహ ఇంటర్నెట్‌ను ఇన్‌స్టాల్ చేయడం గురించి ఆలోచిస్తున్నట్లయితే స్టార్‌లింక్ కిట్‌లో ఏమి వస్తుందో తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఆ టెక్నాలజీ ఏంటి? ఏ ఉపగ్రహ ఇంటర్నెట్‌ను ఇన్‌స్టాల్ చేసిన తర్వాత మాత్రమే మీ ఇంటికి సిగ్నల్స్ వస్తాయి? కంపెనీ నెలకు రూ. 810 ప్లాన్ తీసుకువస్తుందని చెబుతున్నారు. కానీ కిట్ కోసం ఎంత డబ్బు చెల్లించాలి?



స్టార్‌లింక్ కిట్

నివేదికల ప్రకారం, స్టార్‌లింక్ కిట్‌లో 4 ప్రధాన విషయాలు ఉన్నాయి. వీటిలో స్టార్‌లింక్ డిష్, వై-ఫై రౌటర్, పవర్ సప్లై కేబుల్, మౌంటింగ్ ట్రైపాడ్ ఉన్నాయి. స్టార్‌లింక్ డిష్ ఇంటి పైకప్పుపై లేదా స్తంభం పైభాగంలో అమర్చబడి ఉంటుంది. ఇది %ఱుఽ% గొడుగు లాగానే ఉంటుంది. ఈ గొడుగుపై అంతరిక్షం నుండి సిగ్నల్స్ ఉన్నాయి. ఇవి కిట్‌తో వచ్చే వై-ఫై రౌటర్‌కు చేరుకుంటాయి. ఆ రౌటర్ ద్వారా మీ ఫోన్, ల్యాప్‌టాప్, టాబ్లెట్‌లో వై-ఫై ఇంటర్నెట్ నడుస్తుంది.

810 రూపాయల రీఛార్జ్ అంటే ఏమిటి?

స్టార్‌లింక్ నెలవారీ ప్లాన్ ఎంత నుండి ప్రారంభమవుతుందో ఇంకా అధికారికంగా చెప్పలేదు. స్టార్‌లింక్ భారతదేశంలో తన సేవలను నెలకు రూ. 810 నుండి ప్రారంభించవచ్చని నివేదిక తెలిపింది. అయితే ఇన్‌స్టాలేషన్ ఖర్చు ఎక్కువగా ఉంటుంది. ఇది సామాన్యుడికి అందుబాటులో ఉండకపోవచ్చు. ఎందుకంటే ఇందులో కిట్ ధర కూడా ఉంటుంది.

స్టార్‌లింక్ కిట్ ధర ఎంత?

వివిధ వెబ్‌సైట్‌లలో స్టార్‌లింక్ కిట్ ధరను తనిఖీ చేస్తేలో అందుబాటులో ఉన్న కిట్ ధరను, కెన్యాలో అందుబాటులో ఉన్న స్టార్‌లింక్ కిట్ ధరను పరిశీలిస్తే భారతీయ రూపాయలలో ఈ ధర దాదాపు 30 నుండి 36 వేల రూపాయలు. అంటే స్టార్‌లింక్ కనెక్షన్ పొందడానికి ముందు, మీరు కిట్ పొందడానికి దాదాపు 30 వేల రూపాయల బడ్జెట్‌ను కలిగి ఉండాలి. కంపెనీ ఇన్‌స్టాలేషన్ ఛార్జీలు వసూలు చేయకపోయినా, కిట్ ధర ఇప్పటికీ ఎక్కువగా ఉంటుంది. దీనిని సబ్సిడీ పథకం కింద అందించవచ్చు. అయితే, తుది ధర కోసం అధికారిక సమాచారం కోసం మనం వేచి ఉండాలి.

కొందరు మాత్రమే ధనవంతులుగా ఎలా మారుతున్నారు..

మధ్య తరగతి వారు చేస్తున్న పొరపాట్లు ఇవే!



ధనవంతులుగా మారడం అనేది కేవలం అదృష్టం లేదా కృషి మాత్రమే కాదు, ఆర్థిక క్రమశిక్షణ, ఆలోచనా విధానం, పెట్టుబడి వ్యూహాలు వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. ధనవంతులుగా మారినవారు సాధారణంగా కొన్ని ప్రత్యేకమైన అలవాట్లను, ఆలోచనా విధానాలను కలిగి ఉంటారు. కొందరు మాత్రమే సంపదను ఎలా కూడబెడుతున్నరు. మధ్య తరగతి వారు చేస్తున్న పొరపాట్లు ఏమిటి అనే విషయాలను ఇప్పుడు వివరంగా చూద్దాం. డబ్బు సంపాదించే మనస్తత్వం ఉన్నవారు ఆర్థికంగా స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుంటారు. అవి స్వల్పకాలికంగా ఉండవచ్చు, లేదా దీర్ఘకాలికంగా ఉండవచ్చు. ఆ లక్ష్యాలను సాధించడానికి ఒక పక్కా ప్రణాళికను రూపొందించుకొని, దానికి కట్టుబడి ఉంటారు. కేవలం ఒకే ఆదాయ వనరుపై ఆధారపడకుండా, అదనపు ఆదాయ మార్గాలను సృష్టించుకోవడంపై దృష్టి పెడతారు. పక్క వ్యాపారాలు, వివిధ రకాల పెట్టుబడులు వంటి వాటి ద్వారా తమ సంపాదనను పెంచుకుంటారు. అంతేకాదు.. మధ్య తరగతి వారికి డబ్బున్న వారికి ఆలోచన, ఆచరణల్లో ఈ తేడాలుంటాయని నిపుణులు చెప్తున్నారు. పొదుపు, తెలివైన పెట్టుబడులు: సంపాదించిన మొత్తంలో కొంత భాగాన్ని నిరంతరం పొదుపు చేస్తారు. ఈ పొదుపు చేసిన డబ్బును స్టాక్ మార్కెట్, రియల్ ఎస్టేట్, లేదా ఇతర లాభదాయక వ్యాపారాలలో పెట్టుబడిగా పెట్టి తమ సంపదను వృద్ధి చేసుకుంటారు. వీరికి "ఖర్చులు పోగా మిగిలింది పొదుపు" అనే ఆలోచన ఉండదు, "పొదుపు చేయగా మిగిలింది ఖర్చు" అనే సూత్రాన్ని పాటిస్తారు. అప్పులను వ్యూహాత్మకంగా ఉపయోగించడం: వ్యక్తిగత అవసరాల కోసం అప్పులు చేయకుండా, వ్యాపార విస్తరణ లేదా ఆస్తి సంపాదన వంటి రాబడినిచ్చే పనుల కోసం అప్పులను తీసుకుంటారు. అప్పు తీసుకున్న దానికంటే ఎక్కువ రాబడినిచ్చే విధంగా వాటిని వినియోగించుకుంటారు. లెక్కించబడిన రిస్క్‌లు తీసుకోవడం: వ్యాపారంలో, పెట్టుబడులలో రిస్క్ తీసుకోవడానికి వెనుకాడరు. అయితే, అది కేవలం గుడ్డిగా కాకుండా, ప్రణాళికాబద్ధంగా, లెక్కించబడిన రిస్క్‌గా ఉంటుంది. నిరంతర అభ్యాసం, ఆర్థిక పరిజ్ఞానం: ఆర్థిక విషయాలపై నిరంతరం నేర్చుకుంటూ ఉంటారు. మార్కెట్ పోకడలను అర్థం చేసుకుంటారు, ఆర్థిక విశ్లేషణ చేస్తారు. తమ నైపుణ్యాలను, ఆర్థిక జ్ఞానాన్ని ఎప్పటికప్పుడు పెంచుకుంటూ ఉంటారు. ఖర్చులను నియంత్రించుకోవడం: సంపాదించినంత ఖర్చు చేయకుండా, అనవసరమైన ఖర్చులను తగ్గించుకుంటారు. వారికి అవసరమైన వస్తువులను మాత్రమే కొనుగోలు చేస్తారు. ఇది పెట్టుబడులకు ఎక్కువ డబ్బును కేటాయించడానికి సహాయపడుతుంది. మధ్య తరగతి వారు చేసే సాధారణ పొరపాట్లు అనేక మంది మధ్య తరగతి ప్రజలు అదే స్థితిలో ఉండిపోవడానికి కొన్ని సాధారణ పొరపాట్లు కారణం అవుతాయి. నిర్దిష్ట ఆర్థిక ప్రణాళిక లేకపోవడం: చాలా మంది మధ్య తరగతి ప్రజలకు భవిష్యత్తు కోసం స్పష్టమైన ఆర్థిక లక్ష్యాలు, వాటిని చేరుకోవడానికి ఒక ప్రణాళిక ఉండదు. ఎక్కడికి వెళ్లాలో తెలియకపోతే, ఎప్పుడూ అక్కడికే చేరుకోలేరు అన్నట్లు. ఆదాయాన్ని బట్టి ఖర్చులను పెంచుకోవడం: ఆదాయం పెరిగినప్పుడల్లా ఖర్చులను కూడా విపరీతంగా పెంచుకుంటారు. కొత్త జీతం పెరగ్గానే పెద్ద ఇల్లు, కొత్త కారు, ఖరీదైన గాడ్జెట్‌లు కొనడం వంటి "లైఫ్‌స్టైల్ ఇన్ఫ్లేషన్" వల్ల పొదుపు చేయలేకపోతారు. తక్కువ పొదుపు లేదా అత్యవసర నిధి లేకపోవడం: "ఖర్చులు పోగా మిగిలింది పొదుపు" అనే విధానాన్ని అనుసరించడం వల్ల పెద్దగా పొదుపు చేయలేరు. అత్యవసర పరిస్థితుల కోసం (ఉద్యోగం కోల్పోవడం, అనారోగ్యం) కనీసం ఆరు నెలల ఖర్చులకు సరిపడా అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోకపోవడం ఒక పెద్ద లోపం. అనవసరమైన అప్పులు: క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాలు వంటి వాటిపై అధిక వడ్డీకి అప్పులు తీసుకుని, వాటిని విలాసవంతమైన లేదా తక్షణ ఆనందం ఇచ్చే ఖర్చుల కోసం వాడతారు. ఇది అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేస్తుంది. పెట్టుబడులపై సరైన అవగాహన లేకపోవడం: పెట్టుబడుల గురించి సరైన జ్ఞానం లేకపోవడం, లేదా నష్టభయం (రిస్క్) తీసుకోవడానికి భయపడటం వల్ల తమ డబ్బును కేవలం పొదుపు ఖాతాలలో లేదా తక్కువ రాబడినిచ్చే పథకాలలో మాత్రమే ఉంచుతారు. ద్రవ్యోల్బణం వల్ల డబ్బు విలువ తగ్గుతున్నా, దాన్ని అధిగమించే రాబడిని పొందలేకపోతారు. సామాజిక పోలిక: ఇతరులు కొన్న వస్తువులను తాము కూడా కొనాలనే సామాజిక ఒత్తిడి, లేదా ప్రదర్శనా వాంఛతో అనవసరమైన, ఖరీదైన ఖర్చులు చేస్తారు. ఒకే ఆదాయ వనరుపై ఆధారపడటం: ఉద్యోగం లేదా ఒకే వ్యాపారంపై ఆధారపడి, అదనపు ఆదాయ మార్గాలను అన్వేషించరు. ఇది ఆర్థికంగా బలహీనపరుస్తుంది. ఆర్థిక విద్యను విస్మరించడం: డబ్బును ఎలా నిర్వహించాలి, పెట్టుబడులు ఎలా పెట్టాలి, పన్నులు ఎలా తగ్గించుకోవాలి వంటి ఆర్థిక విషయాలపై నేర్చుకోవడానికి ఆసక్తి చూపరు. ఈ జ్ఞానం లేకపోవడం వల్ల చాలా పొరపాట్లు చేస్తారు.

ఇది మామూలు 'మ్యాటర్' కాదు..

ఆ ఈవీ బైక్‌పై అదిరే ఎక్స్ఛేంజ్ ఆఫర్



దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల డిమాండ్ అమాంతం పెరిగింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు ఈవీ స్కూటర్లను వాడేందుకు ముందుకు రావడంతో అమ్మకాలు మరింత పెరిగాయి. అయితే ఇటీవల కాలంలో ఈవీ బైక్‌లను కూడా మార్కెట్‌లో రిలీజ్ చేస్తున్నారు. ప్రముఖ ఈవీ స్టార్టప్ కంపెనీ మ్యాటర్ తన ఈవీ బైక్ అదిరే ఎక్స్ఛేంజ్ ఆఫర్‌ను ప్రకటించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భారతీయ ఎలక్ట్రిక్ వాహన స్టార్టప్, మ్యాటర్ తన తొలి ఉత్పత్తి ఏరాపై అద్భుత ప్రయోజనాలను ప్రకటించింది. మ్యాటర్ ఏరా ఈవీ బైక్ 5000, 5000ం అనే రెండు వేరియంట్లలో లభిస్తుంది. వీటి ధర రూ.1.74 లక్షలు, రూ.1.84 లక్షలుగా ఉన్నాయి. 'మిషన్ ఎక్స్ఛేంజ్ అంటే స్మోక్ టు క్లీన్ ఫ్యూచర్, ఫ్యూయల్ టు ఛార్జ్' పథకం కింద కస్టమర్లు తమ ప్రస్తుత పెట్రోల్ 2 వీలర్ లేదా 4 వీలర్‌కు ఎక్స్ఛేంజ్ విలువను క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా లేదా సందర్శించడం ద్వారా తక్షణమే తనిఖీ చేయవచ్చని ద్విచక్ర వాహన తయారీదారు పేర్కొన్నారు. అదనంగా మ్యాటర్ 5000పై అదనపు ఎక్స్ఛేంజ్ బోనస్‌తో పాటు రూ.10,000 విలువైన బీమా, రిజిస్ట్రేషన్ ప్రయోజనాలను కూడా అందిస్తోంది. మిషన్ ఎక్స్ఛేంజ్ పథకంతో ద్వారా భారతదేశంలో పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సాయం చేయడమే లక్ష్యమని మ్యాటర్ వ్యవస్థాపకుడు, సీఈఓ మోహల్ లాల్భాయ్ పేర్కొన్నారు. ఈ సంవత్సరం ప్రారంభంలో కంపెనీ తన ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్కు జీవితకాల బ్యాటరీ వారంటీని ప్రవేశ పెట్టింది. మ్యాటర్ ఏరా ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ సెగ్మెంట్‌కు మాన్యువల్ గేర్‌బాక్స్‌ను పరిచయం చేసింది. ఇందులో ఎకో, సిటీ మరియు స్పోర్ట్ అనే మూడు రైడింగ్ మోడ్లతో యాడ్ చేయబడిన 4-స్పీడ్ ట్రాన్స్మిషన్ ఉంటుంది. ఈ సెటప్ వైవిధ్యమైన రైడ్ కాంబినేషన్లను అనుమతిస్తుంది. సాధారణంగా సాంప్రదాయ ఈవీలు అందించే దానికంటే ఎక్కువ డైనమిక్ అనుభవాన్ని కోరుకునే రైడర్లను ఆకర్షించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఏరా బైక్‌లు లిక్విడ్-కూల్డ్ పవర్ ట్రెయిన్‌తో వస్తాయి. అందువల్ల వేడి పరిస్థితులలో మోటారు మరియు బ్యాటరీ పనితీరును కొనసాగించడానికి అనుమతిస్తుంది. ఏరా 5 కేడబ్ల్యూహెచ్, ఐపీ67-రేటెడ్ బ్యాటరీతో కూడా వస్తుంది. ఇది ఒకే ఛార్జ్ పై 172 కిలోమీటర్ల వరకు మైలేజ్ ఇస్తుంది. ఈ బైక్ 2.8 సెకన్లలోపు 0 నుండి 40 కి.మీ వేగాన్ని అందుకుంటుంది. మ్యాటర్ ఏరాలో నావిగేషన్, మీడియా, కాల్స్, ఓవర్-ది-ఎయిర్ అప్‌డేట్స్‌కు మద్దతు ఇచ్చే ఏడు అంగుళాల టచ్ స్క్రీన్ డ్యాష్ బోర్డ్ ఉంది. ఈ బైక్లో హెరీమ్ ఛార్జింగ్ కోసం 5 ఎంపీ సాకెట్లకు అనుకూలమైన స్టాండర్డ్ ఆర్బోర్డ్ ఛార్జర్ కూడా ఉంది. రియల్ టైమ్ డేటా యాక్సెస్, రిమోట్ లాకింగ్, జియో-ఫెన్సింగ్, మెయింటెనెన్స్ అలెర్ట్స్‌ను అందించే మొబైల్ యాప్ ఈ బైక్ ప్రత్యేకతలుగా ఉన్నాయి.

వావ్.. ఉద్యోగం పోగొట్టుకున్న తర్వాత కూడా ప్రభుత్వం జీతం చెల్లిస్తుంది!



ప్రపంచంలోని అత్యంత సంతోషకరమైన దేశాలలో ఒకటిగా పరిగణిస్తారు. దీనికి ప్రధాన కారణం దాని సామాజిక భద్రతా వ్యవస్థ. ప్రభుత్వం దాని పౌరుల అవసరాలను పూర్తిగా చూసుకుంటుంది. అది ఆరోగ్యం, విద్య లేదా నిరుద్యోగం కావచ్చు. దీని కారణంగా ప్రజలు మానసిక ఒత్తిడి లేకుండా ముందుకు.. ప్రపంచంలోని అనేక దేశాల విధానాలు వారి పౌరులకు చాలా ప్రయోజనకరంగా ఉన్నాయి. నార్వేలో అలాంటి ఒక ప్రత్యేకమైన వ్యవస్థ అమలు అవుతోంది. ఒక వ్యక్తి తన ఉద్యోగాన్ని కోల్పోతే, అతను ఖాళీగా కూర్చోవలసిన అవసరం లేదు. నార్వే ప్రభుత్వం అటువంటి నిరుద్యోగులకు ఆర్థిక సహాయం అందిస్తుంది. తద్వారా వారు ఎటువంటి ఒత్తిడి లేకుండా వారి తదుపరి ఉద్యోగాన్ని వెతుక్కోవచ్చు.

ఉద్యోగం పోయినా ఆదాయం వస్తుంది:

నివేదికల ప్రకారం.. నార్వేజియన్ ప్రభుత్వం తన పౌరులకు 'నిరుద్యోగ భత్యం', అంటే నిరుద్యోగ భృతిని అందిస్తుంది. దీని అర్థం ఒక వ్యక్తి తన ఉద్యోగాన్ని కోల్పోతే వారు ప్రతి నెలా ప్రభుత్వం నుండి నిర్ణీత మొత్తంలో డబ్బును అందుకుంటూనే ఉంటారు. ఆ వ్యక్తికి మరొక ఉద్యోగం దొరికే వరకు లేదా ఒక నిర్దిష్ట కాలపరిమితి పూర్తయ్యే వరకు ప్రభుత్వం ఈ సహాయం అందిస్తుంది.

ఎంత జీతం వస్తుంది?

ఈ పథకం కింద నిరుద్యోగికి అతని మునుపటి జీతం ఆధారంగా 62.4% వరకు మొత్తం లభిస్తుంది. అంటే, మీరు మీ మునుపటి ఉద్యోగంలో రూ. లక్ష పొందుతూ ఉంటే నిరుద్యోగంలో కూడా మీరు ప్రభుత్వం నుండి దాదాపు రూ. 62,000 పొందవచ్చు. అయితే, దీనికి కొన్ని షరతులు ఉన్నాయి.

పరిస్థితులు ఏమిటి?

ఆ వ్యక్తి గత 12 నెలల్లో కనీసం స్థిర ఆదాయాన్ని సంపాదించి ఉండాలి. అతను తన స్వంత ఇష్టానుసారం తన ఉద్యోగాన్ని వదిలి వెళ్ళకూడదు. ఆ వ్యక్తి నిరంతరం కొత్త ఉద్యోగం కోసం వెతుకుతూ ఉండాలి.ఈ ప్రయోజనం ఎంతకాలం అందుబాటులో ఉంటుంది? నార్వే ప్రభుత్వం ఈ ప్రయోజనాన్ని 2 సంవత్సరాల పాటు అందిస్తుంది. కానీ అది ఆ వ్యక్తి ఉద్యోగం కోల్పోయే ముందు ఎంత కాలం, ఎంత ఆదాయం సంపాదించాడనే దానిపై ఆధారపడి ఉంటుంది. అలాగే, నిరుద్యోగ భృతి పొందుతున్న వ్యక్తి కొత్త ఉద్యోగం కోసం నిజంగా ప్రయత్నిస్తున్నారని నిరూపించడానికి ఉద్యోగ కోసం వెతుకున్న ఆధారాలు, ఇంటర్వ్యూల గురించి సమాచారాన్ని కాలానుగుణంగా అందించాల్సి ఉంటుంది.

అందెల శ్రీరాములు గారు ఎమ్మెల్యేగా గెలవాలని ఆకాంక్షిస్తూ లడ్డూ బహూకరణ



మహేశ్వరం నియోజకవర్గం, నాదర్‌గుల్ గ్రామంలో శ్రీ శ్రీ సీతారామాంజనేయ భక్త సమాజం, భగత్‌సింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. గణనాథుడి నిమజ్జన ఊరేగింపు సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంపాటలో గ్రామానికి చెందిన యాతం వెంకటేష్ యాదవ్, యాతం వేణు యాదవ్ రూ. 2.15 లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం యాతం వెంకటేష్ యాదవ్ మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌ఛార్జ్ అందెల శ్రీరాములును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. దేవుని ప్రసాదంగా పొందిన గణపతి లడ్డూను శ్రీరాములుకు అందజేశారు. రాబోయే తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో అందెల శ్రీరాములు మహేశ్వరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ ఈ లడ్డూను బహూకరించినట్లు వెంకటేష్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు మాజీ కార్పొరేటర్ నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, నిమ్మల రవికాంత్ గౌడ్, దండు శ్రీశైలం యాదవ్, జెనిగే రమేష్ యాదవ్, మంత్రి శ్రీధర్ ముదిరాజ్, జెనిగే శ్రీశైలం యాదవ్, మూతకాని యాదగిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణేష్ ఉత్సవాల ముగింపు: పోలీసులకు బాలాపూర్ ఉత్సవ సమితి సత్కారం





బాలాపూర్ గణేష్ నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసిన సందర్భంగా బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పోలీసు అధికారులకు కృతజ్ఞతాపూర్వక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణలో అహర్నిశలూ శ్రమించి శాంతిభద్రతలను పరిరక్షించినందుకు గాను శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్, బాలాపూర్ సీఐ సుధాకర్, ఎస్సైలు కోటేశ్వరరావు, ప్రసాద్, నవీన్, సోహెల్, నాగరత్న రెడ్డిలతో పాటు పలువురు పోలీస్ సిబ్బందిని సమితి ప్రతినిధులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి చైర్మన్ కల్లెం నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ... గణేష్ నవరాత్రులు, లడ్డూ వేలం పాట, నిమజ్జన ఊరేగింపు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దిగ్విజయంగా పూర్తయ్యేందుకు సహకరించిన పోలీసు శాఖకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ అధికారులు, గ్రామ ప్రజలు, కమిటీ సభ్యులు మరియు భక్తుల సమన్వయంతోనే ఈ ఉత్సవాలు విజయవంతమయ్యాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమితి పెద్దలు వంగేటి లక్ష్మారెడ్డి, సమ్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కుంట సత్యనారాయణ రెడ్డి, వంగేటి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.